మొదటిరోజు ప్రశాంతంగా గ్రూప్ 2

- 4,408 మంది అభ్యర్థుల హాజరు
- ఆలస్యంగా చేరుకున్న వారికి నో ఎంట్రీ
- దరఖాస్తులు చేసిన వారిలో 50శాతం గైర్హాజర్
- పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించిన కలెక్టర్, ఎస్పీలు

వనపర్తి, డిసెంబర్ 15 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం పేపర్-1, మధ్యాహ్నం పేపర్-2 పరీక్షలు నిర్వహించారు. మొత్తం 31 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించగా 8,569 మంది హాజరుకావాల్సి ఉండగా, పేపర్ 1కు 4,408 మంది మాత్రమే హాజరయ్యారు. 4,161 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు. కేవలం 51.4 శాతం హాజరు నమోదైంది. అలాగే మధ్యాహ్నం రెండో పేపర్‌కు 4,381 మంది అభ్యర్థులు హాజరుకాగా, 4,188 మంది గైర్హాజర యయ్యారు. కాగా ఉదయం, మధ్యాహ్నం లేట్‌గా వచ్చిన అభ్యర్థులను పరీక్షా కేంద్రాలకు అనుమతించలేదు. ముందస్తుగా కలెక్టర్ ఆదర్శ్ సురభి చెప్పినట్లుగా ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా అనుమతి ఉండదన్న ఆదేశాల మేరకు అభ్యర్థులకు కచ్చితమైన సమయపాలన పాటించారు. ఇదిలా ఉంటే, పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్పీ రావుల జితేందర్ వేర్వేరుగా పర్యవేక్షించారు. కేంద్రాలను పరిశీలించిన అనంతరం అదనపు కలెక్టర్ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూం నుంచి పరీక్షల సరళిని పరిశీలించారు. అలాగే ఎస్పీ జితేందర్ పరీక్షా కేంద్రాలకు వెళ్లి పర్యవేక్షించారు. ఆయా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్‌ను అమలు చేయగా, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాఠశాల, పీజీ కళాశాల, బాలుర డిగ్రీ కళాశాలల్లో జరుగుతున్న పరీక్ష సరళిని, అలాగే పోలీసు బందోబస్తును ఎస్పీ నిశితంగా పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ వెంకటేశ్వర్ రావు, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రవి పాల్, ప్రత్యేక సీఐ నరేశ్, టౌన్ సీఐ కృష్ణ ఉన్నారు.

గద్వాల అర్బన్ : పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

గద్వాలలో..

గద్వాల/గద్వాల అర్బన్, డిసెంబర్ 15 : గ్రూప్ -2 పరీక్షలు కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఆదివారం ప్రారంభమయ్యాయి. జిల్లా కేంద్రంలోని జ్ఞానప్రభ జూనియర్ కళాశాలలో, నవోదయ మహిళా డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావుతో కలిసి తనిఖీ చేశారు. పరీక్ష లు జరుగుతున్న తీరును పరిశీలించారు. జిల్లాలో 25 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం ఉదయం సెషన్‌లో జరిగిన పరీక్షకు జిల్లాలో మొత్తం 8,722 మంది అభ్యర్థులకు 49.48శాతం మధ్యాహ్నం 4 9.04 శాతం అభ్యర్థులు హాజరైనట్లు కలెక్టర్ వెల్లడించారు.

పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ బందోబస్తు

పరీక్ష కేంద్రాల వద్ద నోటీస్ బోర్డుపై హాల్ టికెట్ నెంబర్లను చూసుకుంటున్న అభ్యర్థులు | ఆలస్యంగా రావడంతో అభ్యర్థిని అనుమతించని అధికారులు | పరీక్షా కేంద్రంలో అధికారుల పరిశీలన

ఉత్తమ ఫలితాలను సాధించాలి

- ఎంపీ మల్లు రవి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

వనపర్తి, డిసెంబర్ 15(నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లు, కేజీబీవీల్లో విద్యాభ్యాసం చేస్తున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించాలని ఎంపీ మల్లు రవి ఆకాంక్షించారు. హాస్టల్ విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నదని ఎంపీ చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కేజీబీవీలో ఎంపీ మల్లు రవితోపాటు ఎమ్మెల్యే మేఘా రెడ్డి, డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి లు బాలికలతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీ మాట్లాడుతూ కేజీబీవీల్లోనూ మెనూ చార్జీల పెంపుదల కోసం ప్రయత్నిస్తానని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో కేజీబీవీల వ్యవస్థ కొనసాగుతుందని ఎంపీ పేర్కొన్నారు. ప్రభుత్వం అన్ని రకాల హాస్టళ్లకు సంబంధించి మెనూ చార్జీలను పెంచి మెరుగైన వసతులను సమకూర్చామని తెలిపారు. విద్యార్థులు బాగా చదివి వంద శాతం ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. బ్యాంకుల ద్వారా అందించే అన్ని రకాల రుణాలను అమలు చేయడంలో పూర్తిస్థాయిలో నిర్లక్ష్యం జరుగుతుందని ఎంపీ చెప్పారు. వీటిపై ఎవరూ దృష్టి సారించక పోవడంతో రుణాలు అమలు చేయడంలో నిర్లక్ష్యం ఉందన్నారు. కనీసం ప్రభుత్వ లక్ష్యంలో సగం కూడా అమలు కావడం లేదని, మరికొన్ని చోట్ల జీరో స్థాయిలోనే ఈ రుణాల అమలు ఉందన్నారు. రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ సెంటర్లను నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేయిస్తామని, ఇందుకు శాశ్వత భవన నిర్మాణాలకు స్థలాలను గుర్తించినట్లు తెలిపారు. త్వరలోనే దీనిని అమలయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని మల్లు రవి మీడియా సమావేశంలో వెల్లడించారు. ఎమ్మెల్యే మేఘా రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని రకాల వసతులు కల్పించి హాస్టళ్ల వ్యవస్థను పటిష్టపరిచిందన్నారు.

క్రిస్మస్ పండుగను సుఖసంతోషాలతో జరుపుకోవాలి

కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

కొత్త కోట, డిసెంబర్15: యేసుక్రీస్తు దీవెనలు మనందరికీ ఉండాలని దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ఎంబీ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల శాఖ కార్పొరేషన్ మాజీ చైర్మన్ రజినిసాయిచంద్, మాజీ ఎమ్మెల్యే రావుల చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా వేడుకలకు హాజరైన ప్రజాప్రతినిధులకు శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఈనెల 25వ తేదీన జరుగనున్న క్రిస్మస్ పండుగను అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చర్చి పాస్టర్ సైమన్, సంఘం చైర్మన్ కృష్ణయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేసిని, మధునా పురం మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రశాంత్, సీడీసీ చైర్మన్ గొల్ల బాబు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు బోయేజ్, కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ జయమ్మ, మాజీ ఎంపీపీ మానిక, మాజీ జెడ్పీ టీలు వామన్‌గౌడ్, విశ్వేశ్వర్, మాజీ సర్పంచ్ చెన్నకేశవరెడ్డి, కౌన్సిలర్లు పద్మ, అయ్యన్న, సంధ్య, రవీందర్ రెడ్డి, ఖాజామైనొద్దీన్, నాగన్న, కోఆప్షన్ సభ్యుడు మిషేక్, సుభాష్, సభ్యులు నిక్సన్, రాజు, ప్రశాంత్, కర్ణకుమార్, ప్రసాద్, ఆనంద్, కిరణ్ పాల్గొన్నారు.

19న కబడ్డీ జూనియర్స్ బాల, బాలికల జట్ల ఎంపిక

వనపర్తి టౌన్, డిసెంబర్ 15 : జిల్లాలోని 20 ఏళ్లలోపు బాల, బాలికల కబడ్డీ ఎంపికను ఈనెల 19న నిర్వహిస్తున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాము, కార్యనిర్వహణాధికారి కుర్మయ్య ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు ఈ కబడ్డీ ఎంపికలో పాల్గొనాలని తెలిపారు. ఈ ఎంపికలు ప్రభుత్వ బాలుర పాఠశాల మైదానంలో జరుగుతాయని, ఎంపికైన బాలికల జట్టు మేడ్చల్‌లో ఈనెల 22న అలాగే బాలుర జట్టు ఈనెల 25న జనగామలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే బాలికలు 65 కేజీలు, బాలురు 70 కేజీలలో ఉండాలని, జనవరి 12, 2005 తర్వాత జన్మించిన వారై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు ఎస్ఎస్‌సీ మెమో, ఆధార్ కార్డు జిరాక్స్‌తో హాజరుకావాలని కోరారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభకనబర్చిన విద్యార్థులు

కుంగ్‌ఫూ కరాటే పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ఎర్రవల్లి చౌరస్తా, డిసెంబర్ 15 : జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఎర్రవల్లి విద్యార్థుల ప్రతిభ కనబరిచారు. హైదరాబాద్‌లో కుంగ్‌ఫూ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన 4వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఎర్రవల్లి విద్యార్థులు పాల్గొని బంగారు, వెండి పతకాలు సాధించారని మాస్టర్లు విజయ్, రాజు లు తెలిపారు. బాలికల స్పైరింగ్ విభాగంలో నందిని, యక్షిత బంగారు పతకాలు సాధించగా, బాలుర కటాస్ విభాగంలో జగదీశ్ బంగారు పతకం సాధించాడు. బాయ్స్ స్పరింగ్ విభాగంలో గోకుల్, కార్తీక్, రాహుల్, హేమంత్, బంగారు పతకాలు సాధించారు. వేణుతేజ, తబ్రజ్, భారత్, జూక్కరేశ్వర్, వెండి పతకాలు సాధించారు. బాలుర కటాస్ విభాగంలో వరుణ్‌తేజ బంగారు పతకం సాధించాడు. గెలుపొందిన విద్యార్థులకు మాస్టర్లు బహుమతులు ప్రదానం చేశారు. కరాటే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కుంగ్‌ఫూ మాస్టర్ విజయ్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ప్రజావాణి కార్యక్రమం రద్దు

గద్వాల అర్బన్, డిసెంబర్ 15 : తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్షల నేపథ్యంలో సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సంతోష్ అదివారం ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అధికారులు, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 పరీక్ష విధుల్లో ఉన్నందున ఎవరూ అందుబాటులో ఉండరని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి సోమవారం నిర్వహించే ప్రజావాణికి దరఖాస్తులతో కలెక్టర్ కార్యాలయానికి రావద్దని సూచించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి

నివాళులర్పిస్తున్న సంఘం సభ్యులు

కొత్త కోట, డిసెంబర్ 15 : కొత్త కోట పట్టణంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆసంఘం సభ్యుడు గుంత రమణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రం రావడానికి అమరజీవి పొట్టి శ్రీరాములు కారణమన్నారు. ఆంధ్ర రాష్ట్రం కోసం అమరణ నిరాహార దీక్ష చేసి, ప్రాణాలర్పించిన మహా పురుషుడని కొనియాడారు. కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ గొల్ల బాబు, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు బోయేజ్, కృష్ణారెడ్డి, మేస్త్రీ శ్రీను, నరేందర్ రెడ్డి, పెంటన్న యాదవ్ పాల్గొన్నారు.

అలంపూర్‌లో కారు బోల్తా

అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 15 : మండలంలోని అలంపూర్ చౌరస్తా సమీపంలో కారు బోల్తా పడిన ఘటన ఆదివారం చోటుచేసుకున్నది. స్థానికుల కథనం మేరకు హైదరాబాద్‌కు చెందిన నలుగురు వ్యక్తులు అలంపూర్ జోగుళాంబ ఆలయానికి కారులో వెళ్లారు. సరిగ్గా బోగుళాంబ హాల్ట్ సమీపంలో కారు టైరు పగిలి కారు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నలుగురికి స్వల్పగాయాలయ్యాయి. వారిని ఓ ప్రైవేట్ వాహనంలో కర్నూల్ దవాఖానకు తరలించినట్లు స్థానికులు తెలిపారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలి

- పే స్కేల్ అమలు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి
- బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్

సమావేశంలో మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ యుగంధర్‌గౌడ్

కొత్తకోట, డిసెంబర్ 15 : ఇరవై ఏళ్లుగా పాఠశాల విద్య అభివృద్ధికి పని చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం హైదరాబాద్‌లో బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర వ్యాప్తంగా సమగ్ర శిక్షలోని అన్ని విభాగాల్లో దాదాపు 19, 600ల మంది కాంట్రాక్టు ఉద్యోగులు పనిచేస్తున్నారని, ఏండ్ల తరబడిగా వారు చాలీచాలని వేతనాలతో జీవితాలు నెట్టుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ సమస్యను పరిగణలోకి తీసుకొని వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రతి ఉద్యోగికి రూ. 10లక్షల బీమా తోపాటు ఆరోగ్య బీమా కూడా రూ.10లక్షల వరకు కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులతో చర్చలు జరిపి వారి న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ పొలిటికల్ జేఏసీ సలహాదారుడు బడేసాబ్, సాయిబాబా, సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సరిత గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ నవనీత గౌడ్, కోశాధికారి శ్రీవాణి, రమ్య, పరీన్, గిరిజా, భవాని, మధురవాణి, మోహన్, సరస్వతి, షేక్‌పాషా పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనంలో కలిసిన 1996-97 బ్యాచ్ జీహెచ్ఎస్ విద్యార్థులు

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయసమ్మేళనం

ఆత్మకూరు, డిసెంబర్ 15 : ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం జరిగింది. 1996-97 పదో తరగతికి చెందిన బ్యాచ్ విద్యార్థులు ఈ సమ్మేళనంలో కలిశారు. పదో తరగతి పూర్తయ్యాక 18 ఏండ్లకు విద్యార్థులందరూ కలిసి అప్లాదంగా గడిపారు. ఒకరికొకరు అప్యాయంగా పలకరించుకుంటూ నాటి తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. స్నేహ బంధంలోని మాధుర్యాన్ని ఆస్వాదిస్తూ తమ గురువులను నెమరు వేసుకున్నారు. రోజంతా పాఠశాలలో గడుపుతూ తమ అనుభవాలను స్నేహితులతో చెప్పుకున్నారు. ఈ సందర్భంగా బ్యాచ్ ముఖ్యులు మాట్లాడుతూ ప్రతి ఏడాది ఒకసారి కలుస్తూ సేవా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో హజ్మతుల్లా, కృష్ణ, బషీర్, శ్రీనివాసులు, లక్ష్మీకాంత్, జగదీష్, శివ, ముజీబ్, ఖాజ, రవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ



రాములును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

కొత్తకోట, డిసెంబర్ 15 : మండలంలోని నాటవెల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త రాములు రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం తన నివాసానికి చేరుకొని అతడిని పరామర్శించారు. పార్టీ తరపున ఎలాంటి అవసరం వచ్చిన సహాయం చేయడానికి ఎప్పుడు ముందుంటుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సుకేశిని విశ్వేశ్వర్, మాజీ జెడ్పీటీసీ వామన్‌గౌడ్, మాజీ సర్పంచ్ చెన్నకేశవ రెడ్డి, మాజీ సర్పంచ్ నాగేశ్, మాజీ సర్పంచులు గోపాల్‌నాయక్, లక్ష్మణ్‌నాయక్, యువ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

గద్వాల అర్బన్, డిసెంబర్ 15 : జిల్లా కేంద్రంలో వరుస దొంగతనాలు చేసిన ఓ వ్యక్తిని పట్టుకున్నట్లు గద్వాల సర్కిల్ సీఐ టంగుటూరి శ్రీనివాసులు పేర్కొన్నారు. అదివారం జిల్లా కేంద్రంలోని సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ కావలి సురేందర్ అలియాస్ శ్రీధర్ కొంత కాలంగా జిల్లా కేంద్రంలోని కృష్ణారెడ్డి మెడికాల్ షాపుతోపాటు వివిధ ఇండ్లలో దొంగతనాలకు పాల్పడ్డాడు. విశ్వసనీయ సమాచారం మేరకు కావలి సురేందర్ పట్టుకొని అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. అతని నుంచి రూ.72వేల నగదు రికవరీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో టౌన్ ఎస్సై కల్యాణ్ కుమార్ ఉన్నారు.

బసవన్న చౌరస్తా ప్రారంభం

బసవన్న చౌరస్తాను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

గద్వాల జెడ్పీ సెంటర్/గద్వాల అర్బన్, డిసెంబర్ 15 : జిల్లాలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలో నిలిచిపోయే విధంగా ఈ బసవన్న చౌరస్తా ఏర్పాటు కావడం సంతోషకరమని అన్ని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. అదివారం జిల్లా కేంద్రంలోని బీరెల్లి చౌరస్తాలో బసవన్న విగ్రహాలను ఏర్పాటు చేసి ఆదివారం బసవన్న చౌరస్తాగా నామకరణం చేసి ప్రారంభించారు. అంతకు ముందు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డికి ఎద్దుల బండ్లపై ర్యాలీగా బసవన్న చౌరస్తా వరకు స్వాగతం పలికారు. గద్వాల జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కంటి అపరేషన్ థియేటర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ సంతోష్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పేర్కొన్నారు. అదివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖానలో కంటి ఆపరేషన్ థియేటర్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ఈ సౌకర్యాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలని, కంటి సమస్యలతో దవాఖానకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో అన్ని విభాగాల వైద్యులు తమ బాధ్యతలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మీనర్సమ్మ, కృష్ణారెడ్డి, లక్ష్మీకాంత్ రెడ్డి, సాయిశ్యాం రెడ్డి, రత్న సిహారెడ్డి, బండారి భాస్కర్, కుర్మన్న, వేణుగోపాల్, మురళి, బెన్న కన్న, శ్రీకాంత్ రెడ్డి, దవాఖాన సూపరింటెండెంట్ వినోద్ కుమార్, ఏఈ రహీ మద్దీన్, వైద్యులు దివ్యా రెడ్డి పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న రంగాపూర్ గ్రామస్తులు

పర్సును బాధితుడి చేతికి అందిస్తున్న రంగాపురం గ్రామస్తులు

కొత్తకోట, డిసెంబర్15 : రోడ్డు పక్కన పడి ఉన్న పర్సును నిజాయితీగా పోలీసులకు అప్పగించిన ఘటన ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకున్నది. ఎస్సై మంజునాథ్‌రెడ్డి కథనం మేరకు పెబ్బేరు మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కావలి శివ, సంధ్యపాగ మహేందర్ బైక్‌పై కొత్తకోటకు వస్తుండగా కొత్త కోట బైపాస్ కూడలిలోని మథర్ తెరెస్సా విగ్రహం వద్ద డబ్బులతో కూడిన పర్సు దొరికింది. దానిని గమనించిన వారు పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు అప్పగించారు. హైదరాబాద్‌కు చెందిన పవన్‌కుమార్ బెంగుళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్నాడని, మార్గమధ్యంలో కొత్త కోట బైపాస్ వద్ద డ్రైవింగ్ చేయడానికి కారులో నుంచి దిగినప్పుడు పర్సు కింద పడిందని తెలిపారు. పర్సులో రూ.2వేల నగదు, ఏటీఎం కార్డులు, క్రెడిట్ కార్డులు ఉన్నాయని ఎస్సై చెప్పారు. పర్సులో ఉన్న వివరాల ఆధారంగా అతనికి సమాచారం ఇచ్చి పర్సును శివ, మహేందర్ చేతులమీదుగా పవన్‌కుమార్‌కు అప్పగించామని ఎస్సై పేర్కొన్నారు.

కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా పోరాడుదాం

సభలో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు అరుణ్‌కుమార్

కొత్తకోట, డిసెంబర్ 15 : కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కార్మిక చట్టాల సవరణకు వ్యతిరేకంగా కలిసికట్టుగా పోరాడాలని తెలంగాణ ప్రగతి శీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలో తెలంగాణ ప్రగతి శీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ వనపర్తి జిల్లా 3వ మహాసభలు నిర్వహించారు. ఈ సమావేశం తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎదుట్ల కురుమయ్య అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా అరుణ్ హాజరై మాట్లాడారు. దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేస్తూ 12 గంటలు పని చేయాలని నిబంధన తీసుకురావడం అనేది కార్మికుల చేత వెట్టిచాకిరి చేయించడం తప్పా మరొకటి కాదన్నారు. కార్మికులకు శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని సుప్రీం కోర్టు, హైకోర్టు ఎంత చెప్పినా ఇప్పటి వరకు అమలు చేయలేదని ఆరోపించారు. కార్మికుల స్థితిగతులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. కార్యక్రమంలో టీయూసీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాద్, కోశాధికారి రాజు, తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గణేశ్, నాయకులు కరీం, బొజ్జన్న, రాజు, గట్టమ్మ, దేవమ్మ, నాగమ్మ, రామచంద్ర, నరేశ్ పాల్గొన్నారు.